# ప్రశ్నావళి

-కె. రామలక్ష్మి

**య:: యు: - ఎమ్మిగనూరు**

నవ్వినా, ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి. ఆ కన్నీళ్లను కూడా దోచుకునే దొరలెందుకు ?

★ ఏమిటండీ యీ పిచ్చిగోల? ఏదో సినిమా పాట పట్టుకుని ఇలా ఇదైపోతే ఎలా ? కన్నీళ్ల దోచుకునే దొరలేమిటి ? ఏడిపించుకుతినే వాళ్లని అర్థం — అంతే !

రాకెట్‌లా దూసుకుపోతూన్న ధరలని అదుపులో పెట్టడం ?

★ పొదుపుగా తినడం; పొదుపుగా కొనడం; ఉన్న కాస్త ఓపికా -- అధిక ధరలని గురించి తిట్టుకుందుకు ఖర్చు చేసెయ్యకపోవడం.

ఎట్టి ప్రభుత్వం ఉత్తమమైనది ?

★ ఏ రాయి అయినా ఒకటే పళ్ళూడగొట్టుకొందుకు ! అధికారంలోకి వచ్చాక — అంతా ఒకటే. చూశాం కదా ?

**సి. హెచ్ ఎన్ - నిడదవోలు**

మగవాడితో మాట్లాడితే అనుమానించేవారిని ఏమనాలి ?

★ అనుమానం కల్గేలా మాట్లాడ్డం దేనికి ? నిస్సంకోచంగా మాట్లాడండి; పుల్లూ పుల్లూ చూస్తూ ఎవరేనా ఏమేనా అనుకుంటారేమో నన్నట్టు ప్రవర్తిస్తూ--అందరి దృష్టినీ ఆకర్షిస్తారెందుకు ? అనుమానిస్తున్నారని బాధపడడం ఎందుకు ? !

**కె బి హెచ్ ఆర్. - దావణగెరె**

మన సమాజంలో పురుషునికి కొన్ని బాధ్యతలు, స్త్రీలకు కొన్ని బాధ్యతలు ఉన్నాయికదా. అంటే స్త్రీ ఇంటిని చక్కదిద్దుకొనటం, పిల్లలను భర్తను శ్రద్ధగా చూడడం...

★ అవి ఎవరు నిర్ణయించారు ? దేవుడు ఆడదైవుంటే పురిటి నొప్పులూ, పిల్లల పెంపకం తప్పకుండా -- మగవాడి బాధ్యతగానే రాసేవాడని నా నమ్మకం. బాధ్యతలు — బరువులు పంచుకోడాలూ కాలాన్నిపట్టి మారుతూవుంటాయి; ఈనాటి స్త్రీ ఇంగితం ఎరిగినది — కనుకనే ఇల్లూ వాకిలి పిల్లాపాపా-కాక చేదోడువాదోడుగా కూడా వుంటూంది... అలాంటప్పుడు అంతమేరకేనా ఆమె బాధ్యతలు ? కొంతైనా తగ్గించాలన్న ఆలోచన సహజీవులకి రావాలి కదా అన్నదే నేటి స్త్రీ బాధ.

**వెంకట్ - ఉరవకొండ**

మీ దృష్టిలో వాస్తవానికి ఊహకు మధ్య దూరాన్ని జతపరిచేవి ఏమిటంటారు ?

★ చేతలు.

**కబీరు - వేపరాల**

దూషణ భూషణ తిరస్కారాలని సమదృష్టితో స్వీకరించకల్గిన మీకు ప్రత్యేక నోబుల్ బహుమతి రావాలని కోరుకుంటున్నాను.

★ థ్యాంకూ ! ఇస్తామని ఎవరూ రావడం లేదయ్య కబీరూ. పైపెచ్చు — వినుక్కుంటే 'వనశేఖర' బదులుచెప్తే గిరశేఖర !! ఎలా చావడం ? రాసుకుంటూ కూనిరాగం తీసే స్వాతంత్ర్యం కూడా పోయిందనుకో యింట్లో — ఎక్కడ ఖరశేఖర బిరుదిచ్చేస్తార పిల్లలని ! పిలిచి పిల్లనిస్తామంటే వంకలెంచే రోజులు ! బిరుదిస్తామన్నా — పుచ్చుకునే ముందు భయపడాలి. అందుకే ఆలోచిస్తున్నానయ్యా.

**ఎ. ఎస్. ఆర్ - హీరమండలం**

ఈ రోజుల్లో పిల్లలు తల్లిదండ్రుల మాటలకు ఏమాత్రం విలువ నివ్వకుండా ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నారు. పెంపకం లోపమా ? కాలం మార్పా ?

★ రెండూను. కాలంతో పిల్లలు మారినట్టు పెద్దలు మారరు. తమ విలువలే — రాటుతేరినవన్న పట్టుదలతప్ప — కాలం మారింది — మన విలువలకి కాలదోషం పట్టిందేమో అని, కుర్రవారి దృష్టితో ఒక్కసారి ఆలోచించి చూద్దామనీ — అనుకోరు. ఎక్కడైతే — ఒత్తిడి వుంటుందో అక్కడంతా -- ఘర్షణ తప్పదు.

# సంచారిణీ దీపశిఖ

నేనూ దిగాలుపడి కూర్చున్నాం. అమ్మమ్మ గురించే మాట్లాడుకుంటున్నాం.

వీధిలోంచి కేక వినిపించి పరుగుపెట్టాను ! ఇంకేముంది ? టెలిగ్రాం ! అమ్మమ్మ చనిపోయిందనీ, వెంటనే బయలుదేరి రమ్మనీ — లక్ష్మీపతిగారు ! ఆ వాక్యం చదివి వినిపించేసరికే అమ్మ మ్రాన్పడిపోయింది !

''ఇలాంటి ఉప్పెనేదో వస్తుందని నాకు ఉదయంనించీ తడుతూనే ఉందిరా బాబూ ! లే — పెట్టెలోనీ బట్టలూ నా బట్టలూ సర్దు ! ఇంకేముంది ? పద బయల్దేరుదాం !''

అమ్మగాని నేనుగాని బావురుమని ఏడవలేదు. కన్నీళ్ళ మాత్రం ఎంత తుడుచుకున్నా ఆగడంలేదు ! టెలిగ్రాం చేరిన ఒక గంటకే రైలెక్కాం. ప్రయాణం చేస్తున్నంతసేపూ అమ్మ నాతో ఒక్క మాటయినా మాట్లాడలేదు. ఇద్దరమూ ముఖముఖాలైనా చూసుకోలేదు ! మేము లక్ష్మీపతి గారింటికి వెళ్లేసరికి అమ్మమ్మ — హాయిగా నిద్ర పోతున్నట్లేవుంది. ఒంటినిండా రంగురంగుల పువ్వులు ధరించింది. గొప్ప సువాసనగా అగరు వొత్తులు వెలుగుతున్నాయి. ఒళ్ళంతా హారతి కర్పూరంపొడి వాసనలు చిమ్ముతోంది !

అప్పటికప్పుడే ఇద్దరు ముగ్గురు కూతుళ్ళు వచ్చారు. ఇద్దరు కొడుకులు కూడా వచ్చారు. ఆ వూళ్లో జనం ఎంతమంది వచ్చారో ! వెడుతున్న వారు వెడుతూంటే — వస్తున్నవాగు వస్తూనే ఉన్నార. ''సుశీలమ్మతల్లీ వచ్చేవా ? మనకింక అమ్మ లేదు !'' అంటూ బావురుమన్నారు లక్ష్మీపతి గారు ! లక్ష్మీదేవమ్మ మాట చెప్పనే అక్కర్లేదు. అమ్మని కావిలించుకొని ఒక్కటే రొదగా యేడుస్తోంది ! అమ్మ అందరినీ తప్పించుకొని వెళ్లి అమ్మమ్మమీద పడిపోయింది. నెత్తీనోరూ బాదుకుంటూ అప్పుడు బావురుమంది. నేనూ మరోప్రక్క అమ్మమ్మ చేతిని పట్టుకొని కూనిరాగాలు తీస్తున్నాను.

లక్ష్మీపతిగారింటి ఆవరణంలో జనం పోగులు పోగులుగా ఉన్నారు. ఎవరి నోట విన్నా జానికమ్మగారి కీర్తిగానమే వినిపిస్తోంది.

అమ్మమ్మ పడుకున్నదగ్గరకి అప్పుడే వచ్చారొక ముసలాయన. కర్ర ఊతంతో ఒంగిపోయి నడుస్తున్నాడు. తొక్కలు వ్రేలాడుతున్నాయి. వచ్చి తల దగ్గర కూర్చున్నారు. ''జానికమ్మతల్లీ వెళ్లిపోయావా ?'' అన్నాడు ఒణుకుతున్న గొంతుతో ! మహాతల్లి దీపంలా వెలిగింది... దీపంలాగే వెళ్లిపోయింది. మనమే దురదృష్టవంతులం ! ఐనా ఎవరూ ఏడవకూడదమ్మా... ఆ మహనీయురాలు దేవత ! మన యేడుపులు చూడలేదమ్మా ! ఎందరి కష్టాలకాదుకొందో ! ఎన్నెన్ని గుప్తదానాలు చేసిందో ''మహాతల్లి !'' అంటున్నాడాయన. ఏడవవద్దంటూనే ఆయన వెక్కివెక్కి ఏడుస్తున్నాడు !

మధ్యాహ్నం రెండు గంటలకల్లా అమ్మమ్మ కూతుళ్ళు పదిమందీ వచ్చారు. కొడుకులు నలుగురూ జమాజెట్టీల్లా సిద్ధంగానే ఉన్నార. ముగ్గురు కొడుకులూ మూడు భుజాలు కాయగా — వర్ధనమ్మపిన్ని భర్త నారాయణమూర్తి నాల్గో కొమ్ము కాశారు. లక్ష్మీపతిగారు తలగోరు పట్టారు. వెనకగా కూతుళ్లంతా నడవగా — అమ్మమ్మ పూలరథం కదిలింది. ఇంతకా వచ్చిన ముసలాయన— ''శ్మశానానికి స్త్రీలు రావడం రివాజుకాదమ్మా ! మీరు వెనక్కి తగ్గండి ! ఆవిడకేం మహనీయురాలు! వెళ్లిపోతోంది.'' అన్నారు. అయినా ఒక్కరూ వినిపించుకోలేదు. జానకమ్మ అక్కయ్య మాత్రం నన్ను పట్టేసుకుని వెళ్లనిచ్చిందికాదు.

అమ్మమ్మకి అగ్నిసంస్కారం చేస్తుంటే — ఏదో తేజస్సు లేచి ఆకాశంలోకి వెళ్లిపోయిందట ! స్పష్టంగా తనకి కనిపించిందని వర్ధనమ్మపిన్ని సత్యవతిపిన్నితో చెబుతూండగా నేను విన్నాను.

లక్ష్మీపతిగారు — కర్మ పదిరోజులూ వైభవంగా జరిపారు. పెద్ద పెళ్లిలాగే జరిగింది. వెనకాముందూ చూడకుండా దశదానాలూ చేశారు. ప్రతిరోజూ ప్రతివారూ అమ్మమ్మ గురించే మాట్లాడుకొనేవారు. ఆ నోటా ఆ నోటా వినగా నాకు తెలిసిందేమిటంటే అమ్మమ్మ తన డబ్బంతా కొడుకులకీ కూతుళ్లకీ తనకి తోచినవిధంగా ముట్టచెప్పిందట !

ఇంతకీ అమ్మమ్మ వెళ్లిపోయింది. ఆవిడ సంచరించే దీపంవంటిది ! ఆమె ఎవరిదగ్గరకు వస్తే వాళ్ల మొగాలు కాంతిలో తళతళలాడేవి. అలా నడచి ముందుకు వెళ్లిపోతే మళ్లీ చీకటి వ్యాపించేది. ఇప్పుడామె మళ్లీ తిరిగిరాదు. ఆ దీపం ఏ ఆవలి లోకాలకు వెళ్లిపోయిందో ? ఎన్ని మొగాలపై చీకటిపడి పోయిందో !!